వీళ్ళతరమా? అసలు ఆధారమేమిటి? ఇంత కథ కొసవరకూ చదివిన మీరైనా కనీసం ఒక్కసారైనా నేను దోషినని అనుకున్నారా? నాకు చాలా సంతృప్తిగా ఉంది. ప్రభుత్వం కన్నెత్తి చూడలేని మూర్ఖులకు తగినట్టు బుద్ధిచెప్పినందుకు. ఇలాంటి అసందర్భ విధానాలతో కూడుకున్న న్యాయశాసనానికీ-దానికి సంబంధించిన పరిశోధక వర్గానికీ ఒక విప్పలేని ముడి, తలబద్దలు కొట్టుకున్నా చెప్పలేని దుర్భేద్య సంఘటన కల్పించినందుకు. ఈ కాగితం ఒకసీసాలో పెడుతున్నాను. ఈ సీసా సముద్రంలో విసిరేస్తాను. ఎవరికీ దొరుకుతుందని నమ్మకంలేదు. దొరకవలసిన అవసరమూ లేదు. దొరికి, ఈ ఉదంతం చదివి కళా ప్రోత్సాహకుడైన ఏ రసికుడైనా ఆనందిస్తే అదే నాకు పదివేలు! మంచి చెడ్డలు తెలిసిన ఏ మహానుభావుడయినా కన్నీరు విడుస్తే అదే నాకు చాలు! ఒకవేళ ఎవరికీ దొరక్కపోయినా, నేను చేసినపనులు నాకు మంచివని తోచిన కార్యాలు, నాకు ఆత్మసంతృప్తి నివ్వడానికి చాలు. నా చిట్టి చైనా చిలుకల్లారా! వుంటాను!—"జస్టిస్ జగన్నాధం."

(ఆధారం : అగతా క్రిస్టీ)

(సమాప్తం)

కథానిక

# మర్యాదకోసం

తాళ్లూరు నాగేశ్వరరావు

"ఏరా నరసింహానికి ఏదో ఒక గుదిబండను మెడకు తగిలించకపోతే లాభంలేదురా! వాడికి అంతకంతకూ తాహతుకు మించిన సోమరితనం బలిసిపోతున్నది. ఇంటిగోడవే పట్టించుకోవడంలేదు. పట్టుమని పాతిక రూపాయల ఉద్యోగంలో పడవేశామంటే, ఆపైన వాడి ఏడ్పేదో వాడే ఏడ్చుకుంటాడు." అన్నాడు మామ.

శంకరం తల ఆడించి, "సరే! ఆలోచిద్దాం" అన్నట్టు ఊరుకున్నాడు. మరునాడు తన స్వగ్రామం వెళ్ళుతూ మామ మళ్ళా తన కొడుక్కి ఉద్యోగాన్ని సంపాదించి పెట్టడాన్నిగురించి జ్ఞాపకంచేసి మరీ వెళ్ళాడు.

ఇది జరిగిన వారం రోజులకు కాబోలు శంకరం పనిమీద గుంటూరు వెళ్ళాడు. పని గడిచింతర్వాత మామగారి మాటలు జ్ఞాపకానికొచ్చినయ్. బావమరిదికి ఉద్యోగం సంపాదించి పెట్టేందుకు ముఖ్యమైన ఇద్దరు ముగ్గురు స్నేహితుల సహాయాన్ని కోరాడు. అందులో భావనారాయణ వీలైనంత సహాయం చేస్తానని వాగ్దానము ఇచ్చాడు. సాయంత్రం కావటంతో ఇద్దరూ డిప్యూటీ తాహశీల్దార్ వెంకటేశ్వర్లు గారింటికి వెళ్ళారు. వెంకటేశ్వర్లుగారు భావనారాయణకు మిత్రుడే కాకుండా కావాల్సినవాడు కూడాను. భావనారాయణ తెచ్చిన రికమండేషన్లను ఎన్నడూ కాదనలేదు, వెంకటేశ్వర్లుగారు. అందుకు స్నేహాన్నీ, నమ్మకాన్నీ మించిన కారణము మరొకటి లేదు. భావనారాయణ శంకరాన్ని తన అంతరంగిక మిత్రుడుగా డిప్యూటీ తహశీల్దారుగారికి పరిచయం చేశాడు. ఆపైన కొంత వరకు సంభాషణ మామూలు విషయాలమీద యథాలాపంగా గడిచాక భావనారాయణ అసలు సంగతిని బయటపెట్టాడు.

వెంకటేశ్వర్లుగారు చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. ఆ భావం భావనారాయణకు చూచాయగా అర్థమైనా శంకరానికిమట్టుకు అగమ్యగోచరంగానే ఉంది.

"చూదాంలెండి" అన్నారు చివరకు వెంకటేశ్వర్లుగారు, తన చిరునవ్వులోని గూఢార్థాన్ని వ్యక్తపరుస్తూ.

శంకరానికి మనస్సు తేలికైంది. అనుకున్న పని అతితేలికగా అయింది. రెండు నిముషాల పాటు నిశ్శబ్దంగా గడిచింది. భావనారాయణ నమస్కారం పెట్టి లేచేసమయంలో వెంకటేశ్వర్లు కలుగజేసుకొని శంకరంతో అన్నారు.

"అయితే శంకరంగారూ! తమది తెనాలి అన్నారు కదూ?"

"అవును."

"ఏమనుకోకండా ఉంటే మీతో చిన్నపని చెబుతాను. మా తమ్ముడికి తెనాలి బదిలీ అయినది. కాస్త వసతిగృహం అద్దెకు కుదిర్చిపెడతారేమోనని" అన్నారు వెంకటేశ్వర్లుగారు.

తన యింటి ప్రక్కభాగం రెండు నెలలనుంచీ ఖాళీగా ఉన్న సంగతి మెరుపులాతట్టింది, శంకరానికి. డిప్యూటీ తహశీల్‌దారుగార్ని కలుసుకోవడం రెండువిధాలా లాభించినట్టు తోచింది శంకరానికి. అటు బావమరిదికి ఉద్యోగం లభించే సూచనలు కలిగినయ్; ఇటు తన ఇంటికి అద్దెవచ్చే ఏర్పాటూ జరుగుతోంది.

"అద్దెకు ఎవరిఇల్లో దేనికి? మా ఇంట్లో ప్రక్కభాగంసబ్ ఇనస్పెక్టరుగారి కుటుంబం వెళ్లిన దగ్గర్నుంచీ ఖాళీగానే ఉంటూన్నది. చాలా మంది వచ్చి వెళ్ళారుకాని, కాస్త మర్యాదగల కుటుంబంవాళ్ళకోసం ఆగాను. ఇక మీరా మాట అన్నారుకదూ! రేపు వెళ్లి ఇంటిని పరిశుభ్రం చేయిస్తాను. అద్దె విషయమంటారా మీవారికి తోచినంత. నేను మర్యాదస్తుల్ని ఎన్నడూ "ఇంత" ఇవ్వమని అడిగి ఎరుగను. ఇంటికి అన్ని వసతులూ సక్రమంగా ఉన్నాయి."

"మంచిది. మాకు కావలసింది ఇటువంటి వసతి కన్నా ఇరుగుపొరుగు మంచివారు కావటమే. మా వాణ్ణి కనుక్కొని 'ఫలానా' తేదీ వచ్చి చేర్తారని మీకు ఉత్తరం వ్రాస్తాను. ఈలోపల మీరు కాస్త ఇల్లుని కడిగి, బూజు దులిపించి, శుభ్రపరచండి."

"ఆ విషయంకూడా మీరు నాకు చెప్పాలటండీ."

సెలవు పుచ్చుకొని శంకరమూ, భావనారాయణా వెళ్ళారు. ఆ రాత్రి భావనారాయణ ఇంట్లో భోజనాలనంతరం శంకరం, డిప్యూటీ తహశీల్‌దారుగారి మర్యాదనూ, గంభీరతనూ చమత్కృతినీగురించి మెచ్చుకున్నాడు. ఉద్యోగస్థుల కుండాల్సిన గర్వంలో ఆయనకు ఏ కించెత్తూ లేదని అభినందించాడు. శంకరం చాలా తేలికమనిషి. అందరికీ సులభంగా అర్థమౌతాడు. మనసులోని మాట దాగదు. మర్యాదకోసం పడి చచ్చే స్వభావం అపరిమితంగా కలవాడు. మర్యాద మంట కలిసిపోబోతోందంటే అతని పడే శ్రమకు మనం విలువ కట్టలేం.

మరునాడు పదిగంటలకు శంకరం తెనాలి చేరుకున్నాడు, రిక్షాలోంచి దిగబోతూ, అద్దె స్తానని చెప్పిన భాగంముందు పంచెపాళీలోకి ఇద్దరుముగ్గురుపిల్లలు ఆటలు ఆడుకొంటూండటం చూశాడు. అతనికి అర్థంకాకపోయినా మనస్సులో ఏదో భ్రమ కలిగినట్టు అదిరిపోయాడు. ఎవరు వీళ్లు? రిక్షావాడు డబ్బులు అడుగుతున్నా, శంకరం ఆ పిల్లలకేసే చూస్తున్నాడు. ఇంతలో ఒక ఇరవై రెండేడ్ల స్త్రీ లోపల్నుంచి "అన్నం పెడతాను రాండర్రా!" అంటూ ఆ ఇద్దరుపిల్లల్ని లోపలకు తీసుకెళ్ళింది. శంకరం దిగాలుపడి చూశాడు. కొంపతీసి ఎవరో అద్దెకుండలేదుకదా! శంకరానికి చెమటలు పోసినయ్. అంతే అయివుంటుంది, ఆ ముఖాలు ఇంతవరకెన్నడూ తన పరిచయంలో తగలలేదు ఎంతపని జరిగింది?

గడపలో అడుగుపెడుతూ చిన్నపిల్లకు అన్నం పెడుతోన్న భార్యను అడిగాడు రుసరుసతో.

"ఎవరే ఆ యింట్లో—"

"అద్దెకు ఉన్నారు నిన్ననే వచ్చి చేరారు. మీరు లేకపోవటంచేత నేనూ అబ్బాయీ కలిసి ఇరవై అయిదురూపాయల కిచ్చాం మొగుడూ, పెళ్ళాం ఇద్దరు పిల్లలే! మొదటినెల అద్దె నిన్ననే ఇచ్చాడు" అన్నది భార్య.

"ఏడవలేక పోయినారూ! నాతో చెప్పకుండా ఎందుకిచ్చారు అద్దెకు?" అని విరుచుపడ్డాడు శంకరం.

ఆమెకు తెరిచిన నోరు తెరిచినట్టుగానే ఉంది. భర్త ధోరణి విపరీతంగా కనపడింది. రెండునెలలనాడు ఖాళీఅయిన యింటికి అద్దెవాళ్లు ఎవ్వరూ రాకపోవడంమూలాన, అద్దె వృథాగా పోతూండడంచేత, పెద్ద కొడుకుతో సంప్రదించి ఆమె అద్దె కిచ్చింది. భర్త ఇట్లా రుసరుసలాడతాడని ఆమె కల కనలేదు.

"ఇప్పుడేం? ఎవరికైనా అద్దె కిచ్చేదేగా?... ఖాళీగా ఎన్నాళ్ళని అట్టే పెడతారు?" అమాయికంగా అన్నదామె.

"అంతేనా? మంచి చెడ్డా అక్కర్లేదూ!..." తల చేత్తో పట్టుకొని ఏంతోచక తిరుగుతున్నాడు

శంకరం. ఎట్లా ఇప్పుడు? డిప్యూటీ తహశీల్ దారుగారి దగ్గర తన పరువు ఏమైపోవాలి? తను మాట ఇచ్చాడు. ఆయనగారుకూడా తన ఇంటి ప్రక్కనే అంటే ఎంతో సంతోషించాడు. బావ మరిదికి ఉద్యోగం యిపిస్తానన్న గౌరవనీయునికి ఇంతమాత్రంగా సహాయం చేయకపోతే ఎట్లా? ఏమైనా సరే తన ఇంట్లోనే వాళ్ళను అద్దెకు వుదర్చాలి. లేకుంటే తన మర్యాద కాస్తా మంట కలిసిపోతుంది. మర్యాదస్తులదగ్గర ఆడిన మాట నిలబెట్టుకో లేకపోవటంకన్నా నీచం మరొకటి లేదు. "ఇప్పుడు ఎట్లా వాళ్ళను ఇంట్లోంచి బయటకు సాగనంపటం?" కర్తవ్యం బోధపడక చికాగ్గా తిరుగుతున్నాడు శంకరం.

భర్త వాలకాన్ని చూస్తోంటే భార్యకు భయ మేస్తున్నది, ఏమంటే-ఏమని మీద విరుచుకు పడ తాడో అని. అందువల్ల ఆమె జోక్యం కలిగించుకో లేదు.

"తెలివి తక్కువ పనిచేస్తే చేశావు, కాని మెల్లగా వాళ్ళను బయటికి సాగనంపే మార్గం చూడు" అన్నాడు శంకరం.

ఆమె భర్త మాటలు అర్థమైనా అంతరార్థం బోధపడలేదు. "అదెట్లా? వాళ్ళు మనం రమ్మంటే వొచ్చారా, మనం పొమ్మంటే పోవటానికి? ఇల్లు అద్దె కిచ్చింతరువాత దాదాపు అమ్మినట్లే."

"అఘోరించినట్లే ఉంది నీ తీర్పు. డిప్యూటీ తహశీల్ దారుగారి తమ్ముడుగారికి ఇల్లు ఇస్తానని వాగ్దానం చేసి వొచ్చాను. వారు మర్యాదస్తులు. గౌరవనీయులు. ఆడినమాట తప్పితే ఇక మన ముఖం జన్మలో వాళ్ళకు చూపగలమా? ఎట్లా గైనాసరే మాటనిలబెట్టుకోవాలి!" అని భార్య ముఖంలోకి చూశాడు శంకరం.

ఆమెకు ఏ ఆలోచనా పాలుపోలేదు. వాగ్దానంచేసి వచ్చినందుకు మనస్సులో భర్తను ఆడి పోసింది. అద్దెకున్నవాళ్ళను మన యిష్టప్రకారం వెళ్ళగొట్టటంకూడా లోకం మెచ్చదు. వాళ్ళు వెళ్ళరు. ఏదైనా ఉపాయం ఆలోచించాలి.

ఆ సాయంత్రం పడకకుర్చీలో కూర్చున్నాడు శంకరం సిగరెట్టు కాలుస్తూ. ఎవరో అపరిచిత వ్యక్తి నెమ్మదిగావచ్చి నిలబడ్డాడు. ఏదో మాట్లాడాలనే కుతూహలంతోటే ఒచ్చినట్లున్నాడు. కాని శంకరం ఆలోచనలో మునిగి వుండడంచేత పలకరించే ధైర్యం లేకపోయింది. కొన్ని నిము షాలు గడిచాక "ఎవరికోసమండీ?" అన్నాడు శంకరం.

"ఇంటియజమాని తమరే కదండీ?" అన్నాడు ఆ ఒచ్చినవ్యక్తి వినయంగా.

"ఊఁ!"

"తమతో కొంచం మాట్లాడదామని. ఏమి లేదు మీ ఇంటి ప్రక్క భాగాన్ని నేనే అద్దెకు తీసుకున్నది. వంటగది వున్నది చూశారూ- ఎక్కువ వాడకం లేకపోవటంచేత గాబోలు పంది కొక్కుల కన్నాలు ఉన్నాయి. వాటిని పూడిపించి కాస్తసున్నం రాయించితేసరి మాయిబ్బంది తొలగిపోతుంది. మీరు త్వరగా చేయిస్తే..."

"సరే-" అన్నాడు శంకరం.

ఆ వ్యక్తి కొంచంసేపు అట్లానే నిలబడి పలక రించి మర్యాదచేసే దిక్కులేకపోవటంచాత తన భాగంలోకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి భార్యతోపాటు కలిసి ఆలోచించగా శంకరానికి ఒక ఉపాయం తట్టింది. కాని ఆ ఉపాయం సఫలం కావటమనేది అవతల అద్దెకున్నవాళ్ళ దయమీద, మంచితనంమీద ఆధారపడి ఉంది. ఆ వీధిలోనే మిత్రుడు సుబ్బ రామయ్యగారి ఇల్లు ఒకటి ఖాళీగా ఉంది. సుబ్బ రామయ్య ఊళ్లో ఉండటంలేదు. ఆ ఇంటిని బాగు చేయించి ఆ యింట్లోకి అద్దె వాళ్ళను మార్చితే తన యింట్లోకి డిప్యూటీ తహశీల్ దారు గారి తమ్ముడుగారు ప్రవేశించవొచ్చు. మర్యాదను కాపాడు కొనేందుకు ఇంతకంటె మంచి విధానం ఎంతయోచించినా అగపడలేదు, శంక రానికి. కాని ఆ అద్దెవాళ్ళను ఒప్పించేది ఎట్లా? వాళ్లు ఒకమాత్రానికి ఒప్పుకుంటారా?

మరునాడు శంకరం స్వయంగా అద్దెకున్న వాళ్ళ భాగంలోకి వెళ్ళి తన పరిస్థితినంతా వివరించి "ఈ స్థితిని గమనించి, మీరు నాయందు దయ వుంచి, ఇంతకంటే వసతిగల గృహం ఈ అద్దెకే-ఈ వీధినే చూపించుతాను. దాంట్లో ప్రవేశించాలి" అన్నాడు చివరకు.

అతను ఆలోచనలోపడ్డాడు.

"మిమ్మల్ని వేడుకొంటున్నాను. మీకు అన్ని వసతులుగల గృహం యేర్పాటుచేస్తాను. నా పరువు మర్యాదల్ని కాపాడండి. ఉద్యోగస్థుల

పట్ల గౌరవంగా సంచరించకపోతే బాగుండదు" మళ్ళా అన్నాడు శంకరం.

అతను "సరే" అని నిట్టూర్పు వదిలాడు.

కృతజ్ఞత తెలిపి తన భాగంలోకి వచ్చి-తాను ఆలోచించిన పాచికపారిందని భార్యతో చెప్పాడు శంకరం.

ఆరోజునే సుబ్బరామయ్యకు ఉత్తరం వ్రాశాడు శంకరం. మూడోరోజు సుబ్బరామయ్య నుంచి సమాధానం ఇట్లా వచ్చింది. "నువ్వు అదే పనిగా అడుగుతున్నావు కనుక ఒప్పుకొంటున్నాను. కాని ఇంటికి కొన్ని చిల్లరమల్లర మరమ్మత్తులు చేయాల్సివుంది. అవిచేయించి అట్లాగే ఇయ్యి."

శంకరం ఇంటి తాళం తీసిచూశాడు. ఎలుకలు పందికొక్కులు కాపురం ఉండటం మూలాన ఇల్లు ఇల్లు రూపంలో లేదు. ఎక్కడ చూసినా కన్నాలు, మట్టికుప్పలు గోడల్నుంచి సున్నపు పెచ్చులు రాలి పడివున్నాయి. గాలిక్కైన బూజు క్రిందపడి నానా సందాలంగా ఉంది. ఎట్లా ఉంటేనేం తప్పేదేముంది? అనుకున్నాడు శంకరం. ఇద్దరు మనుషుల్ని పిలిపించి ఇంటినంతా శుభ్రపరిచాడు. ఇద్దరు తాపీపనివాళ్ళను పెట్టి అవసరమైన చోట్ల కాస్త సిమెంటు రాయించాడు. సున్నం కొట్టించి, ఇంటి వాలకంలో తెచ్చేసరికి శంకరానికి యాభైరూపాయలు ఖర్చు అయినాయి. తను చేసిందంతా వెధవపని అనిపించింది.

"అనవసరంగా యాభైరూపాయల ఖర్చును భరించాల్సి వచ్చింది. నువ్వు గనుక అద్దెకు ఇవ్వక పోతే ఇంత యాతన వుండేదికాదు" అన్నాడు భార్యతో శంకరం.

"నే తెలిసి ఇచ్చానంటారా? ఇప్పుడేమనుకొంటే ఏంలాభం? అక్కడకి వాళ్లు మంచివాళ్లు ఇంకో ఇంట్లోకి పోతామన్నారు ఆదేచాలు" అన్నది భార్య.

మంచిరోజు చూసి శంకరం భాగంలోంచి అద్దెవాళ్ళు సుబ్బరామయ్య ఇంట్లోకి మారారు. ఆ ఇల్లే బాగుంది వాళ్ళకు. శంకరం ఇంటికిలేని కొన్ని మంచిసదుపాయాలు ఆ ఇంటికివున్నాయి. ముఖ్యంగా నీళ్ళబావి పెరట్లో ఉంది. గాలి ధారాళంగా ఇంట్లోకి వస్తుంది. ఇంటికి చాలా మరుగువుంది. ఇంత మంచి ఇంట్లోకి తమని పంపిన శంకరం తెలివి తక్కువతనానికి వాళ్లు నవ్వుకున్నారు.

"శంకరానికి అప్పుడుకాని మనస్సు కుదుట పడలేదు. తరువాత తన ఇంటికి వెల్లవేయించాడు. కిటికీలకు వార్నీషు పూయించాడు. తనయింటి హంగుచూసి డిప్యూటీ తహశీల్దారు గారి తమ్ముడుగారు ఆశ్చర్యపోవాలని శంకరం పిచ్చి యోచన. కాని ఇంకా డిప్యూటీ తహశీల్దారు గారి దగ్గర్నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

"అంతా అమర్చాం. అయితే వాళ్లు ఎప్పుడు వొచ్చి చేరుతారండీ?" అన్నది భార్య.

"ఒస్తారు. ఈవారంలో వొచ్చి చేరరొచ్చు. అయినా అక్కణ్నుంచి సామాను, అంతా తరలి రావొద్దూ. ఎందుకూ "ఫలానా" రోజు వొస్తారని డిప్యూటీ తహశీల్దారుగారు ఉత్తరం వ్రాస్తామన్నారు-తప్పకుండా" అన్నాడు శంకరం.

ఆరోజే డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వర్లుగారి దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది శంకరానికి. శంకరం ఆత్రంగా చదివాడు. ప్రక్కన భార్య ఉన్నది.

"మీరు ఇంటినంతా శుభ్రపర్చి మా తమ్ముడి రాకకోసం ఎదురుచూస్తూ ఉంటారనుకొంటాను. నేనుకూడా అట్లానే వాడికోసం ఎదురుచూశాను. నిన్ననే వొచ్చాడు వాడు. తెనాలి చేరక మునుపే మళ్ళీ అనంతపురం మార్చారట. అంచేత వాడు తెనాలి రావటంలేదు. మీకు అనవసరం శ్రమ కలిగించి ఉంటాను. ఏమీ అనుకోకండి. ఇంటిని ఎవరికన్నా అద్దెకు ఇచ్చుకోండి"

